ప్రజల మాట ప్రగతి బాట

కరీంనగర్ నియోజకవర్గం



వేదికపై ఆయా కార్పొరేషన్ల చైర్మన్లు, మేయర్ సునీల్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్‌కుమార్, కార్పొరేటర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు

# జనసంద్రం

- ప్రజా ఆశీర్వాద సభ గ్రాండ్ సక్సెస్
- భారీగా తరలివచ్చిన ప్రజలు
- కిక్కిరిసిన సభా ప్రాంగణం
- జననేతకు నీరాజనం పట్టిన ప్రజలు

కార్పొరేషన్, నవంబర్ 17: కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వద సభ గ్రాండ్ సక్సెస్ అయ్యింది. కరీంనగర్ నియోజకవర్గం పరిధిలో మహిళలు, వృద్ధులు, రైతులు, యువత పెద్ద ఎత్తున సభకు రావడంతో బీఆర్‌ఎస్‌లో జోష్ నింపింది. ఎస్‌ఆర్ఆర్ కళాశాల మైదానంలో శుక్రవారం నిర్వహించిన సభ సీఎం కేసీఆర్ రాకముందే జనంతో కిక్కిరిసిపోయింది. ఉదయం నుంచే కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండలాలతో పాటు నియోజకవర్గం చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు రావడంతో ఎస్సారార్ కళాశాల మైదాన ప్రాంతాలు జనంతో నిండిపోయాయి. నగరంలోని 60 డివిజన్ల నుంచి మహిళలు భారీగా వచ్చారు. కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ మండలాల నుంచి సభకు వచ్చే దారులన్నీ గులాబీమయం అయ్యాయి. నగరంలోని అన్ని వీధులు బీఆర్‌ఎస్ శ్రేణులతో సందడిగా కనిపించాయి. మధ్యాహ్నం 12 గంటలకే సభా ప్రాంగణం పూర్తిగా నిండిపోయింది. స్థలం సరిపోకపోవడంతో కరీంనగర్–జగిత్యాల రోడ్డుపై భారీగా జనం బారులు తీరి నిలబడ్డారు. ఎస్‌ఆర్‌ఆర్ మైదానంలోకి వెళ్లడానికి అవకాశం లేకపోవడంతో చాలా మంది కళాశాలకు నలుమూలల ఉన్న రోడ్లపై బండ్లు అపి.. అందులోనుంచి ముఖ్యమంత్రి స్పీచ్ విన్నారు. సీఎం కేసీఆర్ ప్రసంగం ప్రారంభం నుంచి తుది వరకు ప్రజలు ఆసక్తిగా విన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్‌పై సీఎం కేసీఆర్ ప్రశంసల జల్లు కురిపించడంతో పాటు ఈసారి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే ఉన్నత స్థానంలో ఉంటాడని పేర్కొనడంతో సభా ప్రాంగణం మొత్తం నినాదాలు చేస్తూ మద్దతు ప్రకటించారు. కేబుల్ బ్రిడ్జి విషయంలో విపక్షాలు చేసిన తప్పుడు ప్రచారాలపై సీఎం కేసీఆర్ చేసిన విమర్శలు కూడా బీఆర్‌ఎస్ శ్రేణుల్లో, యువ నాయకుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. పని చేసే వారిపైనే విపక్షాలు విమర్శలు చేస్తాయంటూ గంగుల పనితీరును కేసీఆర్ మెచ్చుకోవడంతో శ్రేణుల్లో కొత్త జోష్ నింపింది. సభా సక్సెస్ కావడంతో బీఆర్‌ఎస్ శ్రేణులు, నాయకులు పూలు చల్లుకుని ఆనందాన్ని పంచుకున్నారు. మెడికల్ కళాశాల, నవోదయ పాఠశాల ఇవ్వని బీజేపీకి ఓటు వెయ్యవద్దని ముఖ్యమంత్రి పిలుపు నివ్వడంతో సభ చప్పట్లతో మారుమోగింది. అలాగే, తెలంగాణ ఉద్యమానికి, ప్రభుత్వానికి అండగా ఉంటున్న కరీంనగర్ గడ్డకు శిరసు వంచి నమస్కరిస్తున్నాంటూ చెప్పడంతో.. సభ జైకేసీఆర్ అంటూ నినాదాలతో మార్మోగింది. కాంగ్రెస్ పాలనలో జరిగిన విధ్వంసం, అనాడు ప్రజలకు ఎదురైన కష్టాలు, పదేళ్లలో తెలంగాణ సాధించిన విజయాలు, బీజేపీ చేస్తున్న మతరాజకీయాలు వంటి అంశాలను ముఖ్యమంత్రి విడమరిచి చెప్పడంతో.. అందరూ ఆసక్తిగా ఉన్నారు. అలాగే, తెలంగాణ తలసరి ఆదాయంలో నంబర్‌వన్ స్థానంలో ఉందని, విద్యుత్ వినియోగంలోనూ దేశంలో మొదటి స్థానంలో ఉందంటూ ముఖ్యమంత్రి చెప్పడంతో.. సభలో మరోసారి నినాదాలు మిన్నంటాయి. ఎవరు అవునన్నా.. కాదన్న బీఆర్‌ఎస్‌దే మళ్లీ విజయం అంటూ స్పష్టం చేయడంతో జై బీఆర్‌ఎస్ అంటూ సభలో చప్పట్లు మర్మోగాయి. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కూర్మాచలం, మేయర్ యాదగిరి సునీల్‌రావు, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేని మధు, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ జడ్పీ చైర్మన్ రాజేశం గౌడ్, మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణగౌడ్, మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ అక్బర్ హుస్సేన్, ఎంపీపీలు పిల్లి శ్రీలత–మహేశ్, లక్ష్మయ్య, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ షమీ, ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న మేయర్ సునీల్‌రావు, పక్కన మంత్రి గంగుల



కొత్తపల్లి పట్టణం నుంచి సభకు తరలివస్తున్న మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు, ప్రజలు

### సీఎం కేసీఆర్‌కు ఘన స్వాగతం

విద్యానగర్/హౌసింగ్‌బోర్డుకాలనీ, నవంబర్ 17: కరీంనగర్‌లో నిర్వహించిన నియోజకవర్గ ప్రజా ఆశీర్వద సభకు విచ్చేసిన సీఎం కేసీఆర్‌కు నియోజకవర్గ నాయకులు, బీఆర్‌ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. శాతవాహన యూనివర్సిటీ వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకున్న సీఎం కేసీఆర్‌కు బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. వీరితో పాటు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మేయర్ యాదగిరి సునీల్‌రావు, రాష్ట్ర సివిల్ సప్లయి కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. యూనివర్సిటీ నుంచి ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల మైదానం వరకు సీఎం కాన్వాయ్‌తో తరలివచ్చారు. సభ అనంతరం 2.43 గంటలకు సీఎం కేసీఆర్ గంగాధర సభకు ప్రయాణం అయ్యారు.

### సభకు తరలివచ్చిన కొత్తపల్లి, కరీంనగర్ మండలాల ప్రజలు

కొత్తపల్లి, నవంబర్ 17: జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ కళాశాల మైదానంలో నిర్వహించిన సీఎం ఆశీర్వాద సభకు మండలం నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సీఎం ప్రసంగాన్ని ఆసక్తిగా విన్న ప్రజలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గంగుల కమలాకర్‌కు మద్దతు పలికారు. కొత్తపల్లి ఎంపీపీ పిల్లి శ్రీలత–మహేశ్, ఏఎంసీ చైర్మన్ రెడ్డవేని మధు, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కాసారపు శ్రీనివాస్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు ప్రజలను సభకు తరలించారు.

కరీంనగర్ రూరల్, నవంబర్ 17: కరీంనగర్ రూరల్ మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో ప్రజా ఆశీర్వాద సభకు తరలివచ్చారు. తీగలగుట్టపల్లి నుంచి కొమ్ము భూమయ్య, దాసరి సాగర్ ఆధ్వర్యంలో యువకులు ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా గులాబీ కండువాలతో తరలివచ్చారు.



ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన ప్రజలు

## సీఎం కేసీఆర్ సభ సైడ్‌లైట్స్

- వేదికపై సీఎం కేసీఆర్‌కు మైనార్టీ నాయకుడు అక్బర్ హుస్సేన్ దట్టి కట్టారు.
- సీఎం కేసీఆర్‌కు మేయర్ యాదగిరి సునీల్‌రావు గదను బహూకరించారు.
- వేదికపై సీఎం కేసీఆర్‌తో ఫొటోలు దిగేందుకు మహిళా ప్రజాప్రతినిధులు పోటీపడ్డారు.
- సభ విజయవంతమైన ఆనందంలో సభా ప్రాంగణంలో మహిళలు ఒకరిపై ఒకరు పూలు చల్లుకొని సంతోషం వ్యక్తం చేశారు.
- సభ ప్రాంగణం జనంతో నిండిపోవడంతో ఎస్సారార్ కళాశాల ముందు నుంచి ఆర్టీసీ వర్క్‌షాపు గేట్ వరకు చెట్ల నీడన ఫుట్‌పాత్‌పై కూర్చొని సీఎం కేసీఆర్ ప్రసంగాన్ని విన్నారు.
- నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి మహిళలు చిన్నారులతో తరలివచ్చారు.
- గంగుల కమలాకర్ కరీంనగర్ రూపురేఖలను మార్చారని పలువురు ప్లకార్డులను ప్రదర్శించారు.
- సభా వేదికపై ఏర్పాటు చేసిన భారీ ఎల్‌ఈడీ స్క్రీన్ సభికులను ఆకర్షించింది.
- మధ్యాహ్నం 12.30 గంటల వరకే సభా ప్రాంగణం పూర్తిగా నిండిపోయింది
- వందలాది పథకాలకు వరాల జెండా, ఇక్కడ గంగుల... అక్కడ కేసీఆర్... గుర్తుల గుర్తుంచుకో... కారును గుర్తుంచుకో... అనే కొటేషన్లతో కూడిన ప్లకార్డుల ప్రదర్శన సభా ప్రాంగణంలో ఆకట్టుకున్నాయి.
- సభా వేదిక ముందు ఏర్పాటు చేసిన ఓట్ ఫర్ కారు, కారు గుర్తుకే మన ఓటు అనే నినాదం ఆకట్టుకుంది.
- కాంగ్రెస్, బీజేపీ తెలంగాణలో నై చల్‌తా అంటూ కళాకారుడు పృథ్వీ పాడిన పాటకు సభికులు, యువత నుంచి పెద్ద ఎత్తున స్పందన వచ్చింది.
- మూడోసారి కేసీఆర్ సార్ సీఎం కాబోతుండు అనగానే చప్పుళ్లతో సభ ప్రాంగణం మార్మోగింది
- మధుప్రియ పాడిన గుర్తుల గుర్తుంచుకో రామక్క అనే పాట సభకు వచ్చిన వారికి ఊర్రూతలూగించింది
- సభికులంతా తమ చేతుల్లోని జెండాలు, మెడలోని కండువాలు పైకెత్తి డ్యాన్స్‌లు చేశారు.
- వేదికపై ఉన్న పలువురు మహిళా నాయకులు, కార్పొరేటర్లు కూడా నృత్యాలు చేశారు.
- మధ్యాహ్నం 1.37 నిమిషాలకు సభ ప్రాంగణంపై సీఎం కేసీఆర్ హెలికాప్టర్ రౌండ్ వేస్తుండగా సభికులు కేరింతలతో స్వాగతం పలికారు.
- సీఎం కేసీఆర్ మధ్యాహ్నం 1.48 నిమిషాలకు వేదికపైకి చేరుకున్నారు.
- సీఎం కేసీఆర్ మధ్యాహ్నం 2.01 నిమిషాలకు తన ప్రసంగాన్ని ప్రారంభించి 2.36 నిమిషాలకు ముగించారు.
- వేదికపైకి సీఎం కేసీఆర్ రాగానే మంత్రి గంగుల తనయుడు హరిహరణ్ బృందం స్వాగతం పలికింది.
- సీఎం కేసీఆర్ మాట్లాడుతున్నంత సేపు ప్రసంగాన్ని సభికులు ఆసక్తిగా విన్నారు.
- వివిధ పథకాలను వివరిస్తూ మళ్లీ అధికారంలోకి రప్పిస్తే మరింత అభివృద్ధి చేస్తామని ప్రకటించగా చప్పట్లు, కేరింతలతో సభా ప్రాంగణం మార్మోగింది.
- కంటి వెలుగు పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 80 లక్షల మందికి ఉచితంగా అద్దాలు పంపిణీ చేశామని సీఎం ప్రకటించగానే సభికులు పెద్ద ఎత్తున చప్పట్లు కొట్టారు.
- కరీంనగర్ నాడు ఎట్లుండే... నేడు ఎట్ల మారింది... పట్టణం కాదు నగరంగా పిలవాలనిపిస్తోంది అని సీఎం అనగానే యువత కేరింతలు కొట్టారు.
- నగరంలోని కేబుల్ బ్రిడ్జిని ప్రస్తావిస్తూ విపక్షాల తీరును ఎండగట్టగా సభా ప్రాంగణం సభికుల చప్పట్లతో మార్మోగింది.
- రాబోయే కొద్దిరోజుల్లో 24 గంటల పాటు నల్ల నీళ్లు ఇస్తామని ప్రకటించగానే హర్షధ్వానాలతో స్వాగతించారు.
- ఎవరేడ్చినా... ఎవరు మొత్తుకున్న రాబోయేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే అని సీఎం కేసీఆర్ ప్రకటించగానే సభికులంతా కుర్చీల్లోంచి లేచి చేతులు పైకెత్తి మద్దతు తెలిపారు.
- కాంగ్రెస్, బీజేపీ నాయకులకు కరీంనగర్ ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టాలి అని సీఎం అనగానే చప్పట్లతో తమ మద్దతును ప్రకటించారు.
- మైనార్టీల అభివృద్ధి కోసం పదేండ్లలో రూ. 2 వేల కోట్లు ఖర్చు చేశామని సీఎం వెల్లడించగానే ముస్లీం మైనార్టీలు చప్పట్లతో హర్షధ్వానాలు వ్యక్తం చేశారు.

**-కలెక్టరేట్/ విద్యానగర్/కమాన్‌చౌరస్తా/ ముకరంపుర/ తెలంగాణచౌక్/కొత్తపల్లి**